


— మహర్షి

చుక్కారావు టిప్ టాప్‌గా తయారయి దర్జాగా వెళ్ళి ఫలానా వాళ్ళ ఇల్లు ఇదేనాండి! వినయంగా అడిగాడు. అతను పెళ్ళి చూపులకోసం వచ్చాడు.

"వీడెవడండి పగటి వేషగాడివలె వున్నాడు. మేము బిజీగా వున్నాం వెళ్ళెళ్ళు" అన్నాడొకతను. చుక్కారావు గతుక్కుమన్నాడు. అతను తను చెప్పింది విని వుండడనుకునిమళ్ళీఅడిగాడు.

"ఫలానా వాళ్ళింటికి వచ్చి ఫలానా వాళ్ళ ఇల్లు ఇదేనా అడుగుతున్నావంటే నువ్వు పిచ్చిపుల్లామ్‌వి అయి వుండాలి అవునా?" అడిగాడతను.

ఛీ ఛీ తల్లి తండ్రులను వద్దని ఒంటరిగా రావడం బుద్ధి తక్కువైంది అనుకుని మనసులోనే బావురుమని ఏడ్చి వివరాలు చెప్పాడు.

అతను కంగారుపడి, మర్యాదచేసి, గౌరవంగా లోపలకు తీసుకెళ్ళి ఓ గదిలో కూర్చోబెట్టి ఫ్యాన్ ఆన్ చేసి బయటకు వెళ్ళాడు. మరుక్షణం తలుపు దభీమని మూసుకుంది. చుక్కారావు ఉలిక్కిపడి కంగారుగా చూశాడు. కొంపతీసి కొట్టరు కదా అనుకుని భయపడ్డాడు. పారి పోదామంటే మరో దారి కనిపించలేదు. దేవుడిమీద భారంవేసి బితుకుమంటూ సెకన్లు లెక్కబెడుతున్నాడు. అంతలో తలుపు కిర్రున చప్పుడైంది. భయం భయంగా చూశాడు చుక్కారావు. ఓ వితంతువు నెత్తిన ముసుగేసుకుని చెంబు నీళ్ళతో లోపలకు రాగానే మళ్ళీ తలుపు మూసుకుంది.

చుక్కారావు భయం, కంగారు, ఉద్వేగంతో ఏం జరుగుతున్నదో తెలియకుండానే ఆమె అందించిన నీళ్ళు గటగటా తాగేశాడు.

పెళ్ళి చూపులకని తనొస్తే ఈవిడెవరు తెల్లచీర కట్టుకుని టింగు రంగు అంటూ వచ్చింది? కొంపతీసి పెళ్ళి కూతురు కాదు కదా అనుకుని కళ్ళు వెడల్పు చేసుకుని మరీ చూశాడు.

" కంగారుపడకు. నేను పెళ్ళి కూతుర్ని కాదులే" అన్నదావిడ సాగదీస్తూ. ఉలిక్కిపడ్డాడు చుక్కారావు తన మనసులోని మాటను ఎలా గ్రహించిందో తెలియక.

"బాగున్నావా నాయనా?" దీర్ఘం తీస్తూ అడిగింది.

ఇంకా మీ చూపు సరిగ్గా పడలేదు కదా! ఇంతవరకు బాగానే ఉన్నాను అనుకుని తల ఊపాడు చుక్కారావు.

అలా బెల్లంకొట్టిన రాయిలా చూస్తూ, గంగిరెద్దులా అలా తల ఊపుతావేంటి? నన్ను చూసేటప్పటికీ నోటి మాట రావడం లేదా? అవును మరి. నన్ను చూసి మా వారు ఏనాడు నోరు తెరిచి ఎరగరు. అవునూ బాగా బలంగా వున్నావ్ పెళ్ళి చూపుల తతంగలీ పేరిట రోజుకొక ఇంట్లో టిఫిన్లు గట్రా లాగిస్తున్నావా?"

"అదేం లేదు బామ్మగారూ!" కంగారు పడుతూ చుక్కారావు.

## వారసత్వం

"అవున్లే నాయనా! నీ కంటికి నేను బామ్మలా కనబడుతున్నాను. ఎందుకంటే మొగుడు చచ్చిన ముండామోపిని కదా! వయసు లేకపోయినా తెల్లచీర కట్టుకుని గుండు కొట్టించుకున్నాను కదా! అందుకే ప్రతి అడ్డమైన వెధవకీ మరీ యింత ఘోరంగా కనబడుతున్నాను" ఆమె కళ్ళవెంట నీరు జలజలా పారుతున్నా లెక్క చేయడం లేదు.

ఇదెక్కడ దిక్కుమాలిన సంతరా దేవుడా! ఇవెక్కడి పెళ్ళిచూపుర్రా భగవంతుడా! మరీ యింత ఊకదంపుడు పెళ్ళిచూపులు చూడలేదురోయ్ నాయనా! అని చుక్కారావు మనసులో గబగబా ఏడ్చుతున్నాడు.

"అది కాదండి....."

"నువ్వేం చెప్పకు నాయనా! నువ్వు చెప్పకపోయినా నాకు తెలుసు. ఆయనే కనుక వుండివుంటే నీలాంటి వెధవలముందు ఇలా ఈ చీర కట్టుకుని బోడిగుండుతో నిలబడే ఖర్మ ఆ భగవంతుడు ఎందుకురాస్తాడు? ప్చ్. నిన్ను అని ఏం లాభం. నన్నిలా చేసి వెళ్ళిన మా ముసలాడిని తిట్టాలి."

"అయితే మీరు ముసలయాన్ని చేసుకున్నారా?" ఆశ్చర్యంగా అడిగాడు చుక్కారావు.

"ముసలాడిని చేసుకోవటానికి నాకేమి ఖర్మయ. నేను చేసుకున్నప్పుడు కుర్రాడే. ఎటొచ్చినా వయసు తిరిగిపోయి, నా నోటికి తట్టుకోలేక నన్ను ఒంటరిని చేసి ఎంచక్కా వెళ్ళిపోయాడు. నేను మాత్రం కట్టుకొయ్యలా, మట్టిబొమ్మలా, చెట్టుకొమ్మలా, రాతిబొమ్మలా ఇంకా అలాగే వున్నాను. నేను ఈ తనువు చాలించి ఆయన దగ్గరకెళ్ళిన తరువాత చూడు నా సామిరంగా ఏం చేస్తానో...." ఆమె పళ్ళు పటపటా కొరికింది.

"ఏం చేస్తారు?" ఆశ్చర్యంగా అడుగాడు చుక్కారావు.

"ఎందుకు?" నాకంటే ముందు నువ్వుపోతే అడ్రస్ కనుక్కుని విషయం చెబుదామనా? చస్తే చెప్పను. చేసి చూపిస్తా. శభదం చేస్తుందామె.

చుక్కారావుకు పెళ్ళి చూపులకొచ్చిన సంగతి గుర్తు కొచ్చి జుట్టు పరపరా పీక్కున్నాడు.

"ఏం నాయనా! టెన్షన్‌గా వుందా? అవున్లే! వయసులో వున్నావు కదా! అయినా నాలాంటి ముండామోపి కబుర్లు రుచిగా వుంటాయా ఏమిటి? వయసులో వున్న ఆడాళ్ళు కబుర్లు చెబితే చొంగ కార్చుకుంటూ, నవ్వురాకపోయినా, ఒంట్లో ఓపిక లేకపోయినా క్రిందపడి మరీ దొర్లి దొర్లి నవ్వుతారు. వయసు అలాంటిది మరి. నాకు పెళ్ళికాకముందు మా ముసలాడు నాకోసం మా ఇంటి చుట్టు కుక్కలా తిరిగేవాడు. తీరా పెళ్ళయినతరువాత కుక్కిన పేనులా పడివున్నాడు. ఎంతయినా ఆయనిది ఉత్తమజన్మ. ఏనాడూ నాకు ఎదురు చెప్పి ఎరగరు.

అవునవును! చెవులు కోసిన మేకలా అలా అరిసే నీముందు ఆయన మాత్రం ఏం మాట్లాడగలడు? చచ్చిన తరువాత ఎంత ఆనందించివుంటాడో జీవుడు.

చుక్కారావుకు బి.పి. పెరుగుతోంది. పెళ్ళి చూపులకు వచ్చిన వాడిని యిలా పెనంమీద వేపుకు తింటుంటే భరించలేక పోయాడు. ఈ సంబంధం కూడా తప్పిపోతే ఈ సంవత్సరానికి ముహూర్తాలు కూడా లేవు.

ముసలిముండను అడుగుతున్నానని ఏమి అనుకోకు నాయనా! నీ వయసు ఎంత

వుంటుంది?" బుగ్గలు వత్తుకుంటూ అడిగిందావిడ.

చుక్కారావు తటపటాయించి చెప్పాడు.

"అవునా! అంత వయసు వున్నట్లు అనిపించడం లేదు సుమీ! వయసు తెలియకుండా మేకప్ గట్రా వేసుకున్నావా ఏమిటి ఖర్మ. అయితే ముదిరిపోయిన బెండకాయవన్న మాట. ఇంతవయసు వచ్చినా ఇంకా పెళ్ళి కాలేదంటే నీలో ఏదో లోపం వున్నట్లుగా నాకు అనుమానం కలుగుతోంది. నీ వయసులో మా వారు ఆరుగురు పిల్లలకు తండ్రయివెల్లకిలా పడ్డారు. ప్చ్...ప్చ్... ఆయన వున్న రోజులలో ఆ నరదాలే వేరు. ఆయన ఎంత చిలిపి వారంటే.. చెప్పాలంటే నాకు సిగ్గుగా వుంది బాబూ!" ఆమె సిగ్గుపడి పైటచెంగు మొహంమీదకు లాక్కున్నది.

చుక్కారావు హిస్టీరియా వచ్చిన వాడిలా కోపంగా అరిచి, జుట్టు పీక్కున్నాడు.

ఆమె చిన్నగా నవ్వి "అంత కోపం దేనికి నాయనా! అసలే నీ జుట్టు పలచపడి పోయింది. అలాగే పీక్కుంటే మొత్తం వూడిపోతుంది. పెళ్ళి కూతురికి అసలే ముగ్గుల పిచ్చి. మీ పట్నంలో ముగ్గులేసుకోవటానికి వాకిలి వుండదట కదా! అప్పుడు నీ గుండుమీద ముగ్గువేసి దాని నరదా తీర్చుకుంటుంది. అయినా ఆమాత్రం ఓర్చుకోలేని వాడివి రేపు మా అమ్మాయితో ఏం కాపురం చేస్తావు? వస్తాను నాయనా!" అవిడ విసవిసా వెళ్ళిపోయింది. ఆమె బయటకు వెళ్ళగానే తలుపు దబ్బున మూసుకున్నది.

ఇదెక్కడి ముసల్దిరా దేవుడా! తన ఖర్మకాలి ఈ సంబంధం సెటిలయితే జీవితాంతం ఈ ముసలి దాని పోరు భరించాల్సిందేనా? అందుకే పెద్దలన్నారు. ఇంటికి ముసలిపోరు, ఏటికి మొసలిపోరు తప్పదని. చుక్కారావు ఆలోచన్లను తలుపు కిర్రున చప్పుడైంది. పెళ్ళి కూతురు వస్తున్నదని ఆతృతగా చూశాడు. ఇద్దరాడవాళ్ళు లోపల ప్రవేశించగానే తలుపులు మూసుకుపోయాయి. ఇద్దరి చేతిలో నూ గ్లాసులున్నాయి. వాళ్ళిద్దరు శోపు పెళ్ళి కూతుర్లవలె నిలబడి కాళ్ళ వేళ్ళను నేలకేసి రాస్తున్నారు. వారిద్దర్నీ చూసిన చుక్కారావుకు అయోమయం అయిపోయింది.

బ్రతికి వుంటే జన్మంతా బ్రహ్మచారిలా బ్రతకవచ్చు. ఈ సంబంధం తప్పిపోతే మరో సంబంధం చూచుకోవచ్చు. అంతేకానీ పెళ్ళి చూపులకు ఒంటరిగా మాత్రం వెళ్ళకూడదు అని గట్టిగా తీర్మానించుకున్నాడు.

"ముందు నవ్వు యివ్వు" అన్నదొకామె.

"కాదు. ముందే నువ్వు యివ్వు" అన్నది మరొకామె.

"కాదు నువ్వే." "కాదు ముందు నువ్వే."

ఇద్దరూ వాదించుకుంటుంటే చుక్కారావు ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తున్నాడు. చివరకు కాంప్రమైజ్ కొచ్చి గ్లాసులతో తీసుకొచ్చిన టీని అక్కడ వున్న చెంబులో పోసి అందించారు. చుక్కారావు తాగాలా వద్దా అనుకుని సందిగ్ధంలో పడి కనీసం టీ దక్కినా దక్కుతుందనుకుని త్రాగాడు.

"ఎలా వుంది టీ" ఇద్దరూ ఒకేసారి అడిగారు.

"బాగుంది. బాగుంది." రెండుసార్లు చెప్పాడు చుక్కారావు.

"పెళ్ళి కూతురు తయారు చేసింది" కోరస్‌గా చెప్పారు.

ఇదేవిటి? ఏది మాట్లాడినా కోరస్‌గా చెబుతున్నారు అనుకుని అమృతంలా వుంది" అన్నాడు.




"అమృతం అంటే ఎవరు నాయనా? ఆమె మీ మొదటి భార్యా?"

"అబ్బే కాదండి. నాకింకా పెళ్ళి కాలేదు. అమృతమంటే దేవతలు తాగుతారు కదా! అదన్న మాట" ఇబ్బంది పడుతూ చెప్పాడు చుక్కారావు.

"అయితే ఎప్పుడైనా త్రాగావా?"

"లేదండి."

"తాగనిది మరి పోల్చడం దేనికట! పెద్ద గొప్పగా మాు" అన్నారిద్దరు.

మళ్ళీవీళ్ళెవ్వర్రా దేవుడా! ఆవిడెవరో కానీ ఇంతసేపూ వేయించుకు తిన్నది. వీళ్ళు మరో మొహమాటం లేకుండా బాదుతున్నారు. ఇక నన్ను రక్షించేవారే లేరా దేవుడా! మూడుకోట్ల దేవతలలో ఒక్కరైనా నన్ను రక్షించరు అని మనసులోనే వేడుకున్నాడుచుక్కారావు.

"ఇంతకుముందు వచ్చినావిడ ఎవరండి" ఏడవలేకనవ్వి వినయంగాఅడుగాడు.

"ఏం నాయనా ఆ ముసలిది బాగా చితక్కొట్టిందా అలా మొహం వేలా డేసుకున్నావ్! మేము మరీ అంత చితక్కొట్టంలే. అలా చితక్కొట్టడం అసలు యిష్టం వుండదు. అయినా మేమిద్దరం చాలా అన్యోన్యంగా వుంటాం. మా వారిని అనుకోకుండా ఇద్దరం ప్రేమించి ఎవరిని చేసుకోవాలో తెలీక ఇద్దర్నీ చేసుకున్నారు.

వాళ్ళ, వీళ్ళ గొడవలో పడి తనెందుకు వచ్చాడో మరచిపోయాడుచుక్కారావు.

పెళ్ళేనేరమా-ప్రేమే ఘోరమా అనే పాట అందుకుని ఈ ట్రాన్స్‌లో నడచి వెళ్ళిపోతున్న అతన్ని పట్టుకుని పెళ్ళికూతుర్ని చూపించి, అతని ఆమోదం తీసుకుని వారం రోజులలోనే అతని బుర్రలో మరో ఆలోచన రాకముందే పెళ్ళి జరిపించారు.

శోభనం రాత్రి రాజ్యం చుక్కారావు ప్రక్కన చేరింది. చుక్కారావు పరవశించిపోతూ, ఒళ్ళు తీయగా మూల్గుతుండగా ఆమెను పలుకరించాడు. రాజ్యం మాట్లాడింది. ఓ గంట గడిచింది. రాజ్యం మాట్లాడుతున్నది. రెండుగంటలు గడిచాయి. రాజ్యం మాట్లాతూనే వున్నది. అయిదు గంటలు గడిచాయి. ఆమె నోటికి పని కల్పిస్తూనే వున్నది. చుక్కారావుకు నిద్ర ముంచుకురాగా నిద్రపోయాడు. రాజ్యం వాగ్ధాటికి అడ్డు కట్ట లేకపోయింది. చుక్కారావుకు మెలకువ వచ్చి ఉలిక్కిపడి లేచి కుర్చున్నాడు. రాజ్యం నిద్రపోచున్నది. కానీ, నోరు మాట్లాడుతూనే వున్నది. దానికి సొల్యూషన్ ఎంత ఆలోచించినా చుక్కారావుకు తట్టలేదు. అతని గుండె గుబగుబమన్నది. కాళ్ళు చేతులు వణికాయి. భయంతో, దిగులుతో, బాధతో కుమిలిపోయాడు.

పెళ్ళి చూపులనాడు జరిగింది గుర్తుకొచ్చింది. అయితే వాళ్ళ వారసత్వం రాజ్యం పుణికి పుచ్చుకున్నదన్నమాట. అయితే రేపు తమకు ఆడపిల్ల పుడితే ఈ వారసత్వం అలా అలా పాకి మరొకర్ని బలి తీసుకుంటుందన్న మాట అనుకుని అసలు పిల్లలు పుట్టకుండా వుండే మార్గం అన్వేషిస్తున్నాడు పూర్‌ఫెలో చుక్కారావ్.